ప్రజాశక్తి
గురువారం 10 ఆగస్టు 2023
5
శ్రీకాకుళం

నేడు చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు వంశధార-నాగావళి నదుల అనుసంధానం కోసం నిర్మాణంలో ఉన్న హైలెవల్ కెనాల్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వంశధార నదిపై గొట్టాబ్యారేజీని సందర్శిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 వరకు రిజర్వు కాగా అనంతరం 2గంటల వరకు వంశధార ప్రాజక్టును పరిశీలిస్తారు. 2.30 గంటలకు కొత్తూరు మండలం గూనభద్రలోని శ్రీ లక్ష్మీరాజా ఫంక్షన్ హాల్‌లో 2.20 నుంచి 3.30 గంటల వరకు సమావేశాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. ఐదు నుంచి ఆరు గంటల వరకు కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభలో పాల్గొంటారు. సభ అనంతరం సీతంపేట, పాలకొండ, ఆమదాలవలస బైపాస్ మీదుగా శ్రీకాకుళం జాతీయ రహదారికి చేరుకుని రోడ్డు మార్గాన రాత్రి 9గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు.

క్విట్ మోడీ... సేవ్ ఇండియా

- బిజెపిని గద్దె దించి దేశాన్ని కాపాడాలి
- క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమం
- రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు
- శ్రీకాకుళం, టెక్కలి, పలాసలో ధర్నాలు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, టెక్కలి రూరల్, పలాస

క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆల్ ట్రేడ్ యూనియన్స్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన 'క్విట్ మోడీ-సేవ్ ఇండియా' పేరిట కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోడీ పాలనలో కార్మిక, రైతు సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదని, కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలన్న డిమాండ్‌ను పెడచెవిన పెట్టారని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులు, స్కీమ్‌వర్కర్ల శ్రమను దోచుకోవడం తప్ప వారిని రెగ్యులర్ చేయలేదన్నారు. రక్షణ, రైల్వే, బ్యాంకులు, ఎల్‌ఐసి వంటి కీలక రంగాలతో సహా ప్రతి ప్రభుత్వరంగ సంస్థను ప్రైవేటీకరిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. 900 రోజులుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నా, ప్రైవేటీకరణకు దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ మూతపడితే లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతారని, పర్మినెంట్ ఉద్యోగాలనేవి లేకుండా కార్మికులు బానిసలవుతారని తెలిపారు. ఇపిఎస్ పెన్షన్‌ను రూ.ఏడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన త్రైపాక్షిక భారత కార్మిక మహాసభను బిజెపి ప్రభుత్వం 2015 నుంచి నిర్వహించడం లేదని, ఈ మహాసభలు జరిగితే కార్మిక సమస్యలు చర్చకు వస్తాయని చెప్పారు. సంపద మొత్తం అదానీ, అంబానీ వంటి వారి చేతుల్లో పోగుపడి ఆర్థిక సంక్షోభాలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగ పోరాటానికి తలొగ్గి నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేసినా, రైతులకు మోడీ ఇచ్చిన వాగ్దానాలు ఇంతవరకు నెరవేర్చలేదని విమర్శించారు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు తగ్గించి చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్మికులు, ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి మోడీ ప్రభుత్వం మతాల వారీగా ప్రజలను నిట్టనిలువునా చీలుస్తోందన్నారు. వ్యవసాయం కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి పోయి ఆహార సంక్షోభాలు వస్తాయని, మిగిలి ఉన్న సబ్సిడీలు పోతాయని, అందుకనే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని కోరారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించాల్సింది పోయి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన మద్దతు ఇస్తున్నాయన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, రైతు సంఘం నాయకులు బలగ శ్రీరామ్మూర్తి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి డి.గణేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి చిక్కాల గోవిందరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద...

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మహాత్మాగాంధీ విగ్రహం వద్ద క్విట్ వివక్ష, క్విట్ మతోన్మాదం పేరుతో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగరాపు ఈశ్వరమ్మ, కెవిపిఎస్ నాయకులు కె.నరసింహులు, సిపిఎం నాయకులు టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో...

టెక్కలి రూరల్ : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, రైతుసంఘం నాయకులు బగాది వాసు, బగాది కృష్ణ, ఎం.గోపాల్, ఎఐటియుసి నాయకులు యడ్ల గోపి, రాజారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పలాసలో...

పలాస : కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద కార్మిక, రైతాంగ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, లిబరేషన్ సీనియర్ నాయకులు ఎం.మల్లేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు సిహెచ్.వేణుగోపాల్, జేడీ రైతుల సంఘం నాయకులు తెప్పల అజయ్ కుమార్, రైతుసంఘం నాయకులు టి.భాస్కరరావు, కె.బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య మహోత్సవంలో...

భాగస్వాములు కావాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఔన్నత్యాన్ని దశదిశలా చాటి చెప్పేందుకు స్వాతంత్ర్య మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన నగరంలోని శాంతినగర్ కాలనీలో గల గాంధీ స్మృతివనంలో మేరా మట్... మేరా దేశ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ముగింపు కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిజ్ఞ, అమరవీరులకు వందనం, ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటే వసుధా వందనం, ప్రధాని, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన శిలాఫలకాల ఆవిష్కరణ, అమరవీరులను గుర్తించడం వంటి ఐదు రకాల కార్యక్రమాలను ఆగస్టు 15 వరకు జిల్లాలోని 912 గ్రామ పంచాయతీలతో పాటు 75 వార్డుల్లో నిర్వహించబోతున్నట్లు వివరించారు. ఈనెల 15 తర్వాత ప్రతి గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గం నుంచి కొంత మట్టిని సేకరించి, దాన్ని ఢిల్లీకి పంపనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఆయుష్ డాక్టర్ జగన్నాథం, సెట్విజ్ సిఇఒ ప్రసాదరావు, ఎన్‌వైకె కోఆర్డినేటర్ ఉజ్వల, గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు ఎం.ప్రసాదరావు కొంక్యాన వేణుగోపాల్, ఎం.వి.ఎస్ శాస్త్రి, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

గంజాయి, గుట్కా, నాటుసారా, అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అడ్డుకట్ట వేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి, గుట్కా, ఖైనీ, మద్యం రవాణా కాకుండా చూడాలన్నారు. పక్కా ప్రణాళికను రూపొందించుకుని ఎప్పటికప్పుడు ఆకస్మిక దాడులు నిర్వహించాలని తెలిపారు. నాటుసారా తయారీ, ఉత్పత్తి, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్డాన్ సెర్చ్ చేపట్టి ఆయా గ్రామాల్లో నాటుసారా తయారీ ముడి పదార్థాలను నిర్వీర్యం చేయాలని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జెడి ఎం.ఎన్ మణికంఠ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ రవాణాను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి, ఇసుక, నాటుసారా, మద్యం పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి ఎస్‌ఇబి కమిషనర్ రవిప్రకాష్ పంపించిన ప్రశంసాపత్రాలను ఎస్‌పి అందజేసి అభినందనలు తెలిపారు.

మిస్సింగ్ కేసుల్లో పురోగతి సాధించాలి

మిస్సింగ్ కేసులను సమగ్ర దర్యాప్తుతో పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కాశీబుగ్గ పోలీస్ సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన నెల వారీ నేర సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రాధాన్యత గల కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వాహన తనిఖీలను విస్తృతం చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేర నివారణకు సబ్ డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. నైట్ బీట్స్ బలోపేతం చేసి, అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నేరాల నివారణ, నేరస్తులను గుర్తించడానికి సిసి కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అన్ని ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు వ్యాపార సముదాయాలు, ఆలయాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి, ఎఒ గోపీనాథ్, కాశీబుగ్గ సబ్ డివిజన్ సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చంద్రబాబుని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - నరసన్నపేట

తన అధికార దాహం తీర్చుకోవడం కోసం చంద్రబాబు ఎంతమందినైనా బలి తీసుకుంటారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పుంగనూరులో పోలీసులపై దాడికి ముమ్మాటికీ చంద్రబాబే కారకుడని, ఈ కేసులో అతనే ప్రథమ ముద్దాయి అని అన్నారు. హింసాత్మక రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. పుంగనూరు ఘటనలో రాజకీయ లబ్ధి పొందాలనేది బాబు రాజకీయ పన్నాగమని చెప్పారు. ఈ ఘటనలో 50 మంది పోలీసులకు తీవ్ర గాయాలై, ఒక కానిస్టేబుల్‌కు కన్నుపోయిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జనసేన పార్టీ కార్యకర్తపై ఒక పోలీసు మహిళా అధికారి చేయి చేసుకున్నారని రచ్చ చేసిన పవన్ కళ్యాణ్ ఇప్పుడెక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తన దత్త తండ్రికి మద్దతుగా నిలవడానికి తన సొంత తండ్రి పనిచేసిన పోలీసు శాఖలో సాటివారికి గాయాలైనా నోరుమెదపరా అని నిలదీశారు.

యుసిసితో ఐక్యతకు భంగం

- ఏకరూపం సివిల్ కోడ్ పేరుతో మతాల మధ్య చిచ్చు
- బిజెపి ప్రయత్నాలను అంతా తిప్పికొట్టాలి
- మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

భిన్నత్వంలో ఏకత్వం జాతీయోద్యమ వారసత్వమని, కలసికట్టుగా ఉన్న దేశ ప్రజల చైతన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దెబ్బతీస్తోందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన యూనిఫాం సివిల్ కోడ్‌పై బుధవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. యుసిసి తీసుకురావాలన్నది మోడీ అసలు ఉద్దేశం కాదని, దాన్ని చర్చనీయాంశంగా చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, సంక్షోభాలపై ప్రజలు ఆలోచించకూడదనేది అసలు రహస్యమన్నారు. ముస్లిములు శత్రువులుగా స్థిరపడితే, మోడీకి హిందువులు ఓటేస్తారనేది ఇందులో ఉన్న రాజకీయమన్నారు. అన్ని మతాలు, జాతులు కులాల్లోని అనేక తేడాలు ఉన్నాయని, ఆచారాలు, సంప్రదాయాలను ఒక జాబితా రాస్తే తర్వాత అప్పుడు ఏకరూపానికి ఒక ప్రాతిపదిక వస్తుందని లా కమిషన్ చెప్పిందన్నారు. అసలు జాబితా లేనప్పుడు అందరికీ ఏకరూపం తీసుకురావడంపై చర్చ ఎందుకని ప్రశ్నించారు. ముస్లింలు, హిందువులు, క్రైస్తవుల్లో దురాచారాలు ఏమైనా ఉంటే ఆయా మత పెద్దల్లోనే చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. ఆ తర్వాతే యూనిఫాం సివిల్ కోడ్‌పై చర్చించవచ్చని చెప్పారు. గోవాలో పోర్చుగల్, యానాంలో ఇప్పటికీ ఫ్రెంచ్ కోడ్ అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. గిరిజనులో ఆర్థిక పరిస్థితి వల్ల వారిలోనూ బహు భార్యత్వం ఎక్కువగానే ఉందని, దాన్ని అంగీకరించబోమని కేంద్రం చెప్పలేదన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ గిరిజనులకు కాదని అమిత్‌షా చెప్తున్నారని, కొందరికి మినహాయిస్తే అది ఏకరూపం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ముస్లింలు, హిందువులు పరస్పరం శత్రువులుగా చూడాలన్నదే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమన్నారు.

అంబానీ, అదానీకి, మోడీకి మధ్య సంబంధాలు మాత్రం ఎవరూ చూడకూడదన్నారు. దక్షిణ భారతదేశంలో మేనరికాలు బలమైన అనాగరిక సాంప్రదాయమని, ఉత్తర భారత దేశంలో దీన్ని ఏమాత్రం అంగీకరించరని ఇటువంటి సందర్భంలో అందరికీ ఏకరూపం ఎలా సాధ్యపడుతుందని చెప్పారు. ఆదాయపన్నుశాఖలో హిందూ అవిభాజ్యత కుటుంబానికి అనేక రాయితీలు ఇస్తోందని, యుసిసి వస్తే ఇతర మతాలకూ ఇస్తారా, హిందూ మతానికి తీసేస్తారా అని ప్రశ్నించారు. మోడీ అనుకున్న దానికి భిన్నంగా ఉండటం వల్లే 2021లో లా కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయలేదన్నారు. యునిఫాం సివిల్ కోడ్ డిక్లేర్ చేసి తీసుకొస్తే అన్ని మతాల నుంచీ వ్యతిరేకత వస్తుందనే దాన్ని మోడీ కప్పిపెట్టారని చెప్పారు. ప్రజల్లో ముందు సమానత్వం తీసుకొస్తే, తర్వాత ఏకరూపం కోసం ఆలోచించవచ్చని చెప్పారు. మణిపూర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలగాల ఆధ్వర్యంలో మారణహోమం జరుగుతోందన్నారు.

రేడియంట్ హెల్‌కేర్ వైద్యులు డాక్టర్ అదీబ్ హసన్ మాట్లాడుతూ యుసిసి ముసాయిదా బిల్లు ప్రజల ముందు ఉంచకుండానే దేశవ్యాప్త చర్చకు, అభిప్రాయ సేకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. యూనిఫాం సివిల్ కోడ్ కోసం మాట్లాడుతున్న ప్రభుత్వం పౌరుల, సివిల్ రైట్స్ మాటేమిటని ప్రశ్నించారు. యుసిసి పేరుతో ముస్లింలను అణచివేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ముస్లింలు, హిందువుల మధ్య మత ఘర్షణలు రేపి 2024 ఎన్నికల్లో బిజెపి గెలవడానికి ప్రయత్నిస్తోందన్నారు. యూనివర్సిటీ న్యాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వేర్వేరు మతాలకు విభిన్న చట్టాలు ఉన్నాయని చెప్పారు. సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా చట్టాల్లోనూ మార్పులు జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. విభిన్న ఆచారాలు, సంప్రదాయాలతో రూపొందించిన చట్టాలను కాదని యుసిసి తీసుకురావడం సరైంది కాదన్నారు.

గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ యుసిసి తీసుకురావడం వెనుక కేంద్ర ప్రభుత్వం ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. దేశ సమగ్రత, సమైక్యత కాపాడడానికి సివిల్ కోడ్ అవసరమే గానీ బలవంతంగా రుద్దడం సరికాదన్నారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సభ్యులు పి.సుధాకరరావు, కె.శ్రీనివాసు ఆర్.మధుసూదనరావు, కె.రామకృష్ణ, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపల్ బి.వి రమణమూర్తి, కె.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ హదీబ్ హసన్

వధూవరులకు ఆర్థిక చేయూత

1436 మందికి రూ.8.76కోట్ల లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన వధూవరులకు ఆర్థికంగా చేయూతనందించే లక్ష్యంతో ప్రభుత్వం కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాలను అందిస్తోందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 1436 మంది లబ్ధిదారులకు రూ. 8.76 కోట్లు లబ్ధి చేకూరుతోందన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణమస్తు, షాదీతోఫా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఆర్థిక లబ్ధిని లబ్ధిదారుల తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏప్రిల్ - జూన్ 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న వారికి ఈ ప్రయోజనం చేకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నాగేంద్ర మీనా, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కళింగవైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డిసిసిబి అధ్యక్షులు కె.రాజేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ డి.వి.విద్యాసాగర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వై.విశ్వమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విద్యార్థులందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డీ వార్మింగ్ డేలో భాగంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు పక్కాగా వేయించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో అపోహను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒలు, ఆరోగ్య కార్యకర్తలు , ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలన్నారు. మాత్రలు తీసుకోకుండా మిగిలి ఉన్న వారికి 17న మాప్ అప్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు (ఆల్బెండాజోల్ 400 ఎంజి) తప్పనిసరిగా నమిలించి మింగించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో 1 నుండి రెండేళ్ల వరకు సగం మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తల ద్వారా మాత్రలు వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 5 వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత ప్రతి విద్యార్థికి వైద్యారోగ్య, విద్యా శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో నమిలి తినిపించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న, బడికి వెళ్లని పిల్లలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న మొత్తం 4,44,162 మందికి మాత్రలు పంపిణీ చేశామని వివరించారు. సమావేశంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య జిల్లా సమన్వయకర్త సి.పి శ్రీదేవి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ప్రోగ్రాం మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కృషి

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - మందస / పలాస

గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రూ.30 లక్షల అంచనా విలువతో నిర్మించనున్న ట్రైబల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆదివాసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలని, ఏ ప్రభుత్వం వల్ల గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయో పరిశీలన చేయాలని కోరారు. రెండున్నర లక్షల ఎకరాలు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఇంకా ఎవరికైనా అర్హత ఉండి ఇవ్వాల్సి ఉన్నట్లయితే వారికీ పట్టాలు అందజేస్తామని తెలిపారు. జిల్లాల విభజనలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం రెండు గిరిజన జిల్లాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చంద్రబాబు పాలనలో గిరిజనులు పూర్తిగా వెనుకబడిపోయారని విమర్శించారు. ప్రతి గిరిజన కుటుంబాన్ని ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి జగన్ పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం గిరిజనులతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, వైస్ ఎంపిపి సీర ప్రసాద్, తహశీల్దార్ బి.పాపారావు, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, మందస మేజర్ పంచాయతీ సర్పంచ్ సిహెచ్.ఎల్లమ్మ, ఎంపిటిసి కంచి బెహరా, ఆదివాసీ వికాస పరిషత్, గిరిజన సంఘాల నాయకులు సవర.చంద్రరావు, ఎస్.డుంబురు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వికలాంగుని సమస్యలను తెలుసుకుంటున్న స్పీకర్ సీతారాం

వికలాంగులు ఎందులోనూ తక్కువ కాదు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వికలాంగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, ఎందులోనూ తక్కువ కాదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని స్థానిక మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన అలిమ్ కో-సంస్థ హైదరాబాద్ సహకారంతో వికలాంగులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులు మూడు చక్రాల సైకిళ్లు, రెండు చక్రాల తోపుడు కుర్చీలు, చంక కర్రలు, కృత్రిమ అవయవాలు, మడత కర్ర, బ్రెయిలీ పలక, డిజి ప్లేయర్, శ్రవణ యంత్రాలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ పరికరాలు త్వరలో పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మండలాలకు చెందిన వికలాంగులు పాల్గొన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో వికలాంగులు ఎవరికి తీసి పోనీ విధంగా రాణిస్తున్నారని కొనియాడారు. వికలాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, వికలాంగుల ఎడి కవిత, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కాంతారావు

స్టాక్ వివరాలు లేకపోతే ఎలా?

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పొందూరు, రాపాక గ్రామాల్లోని రేషన్ డిపో, అంగన్వాడీ కేంద్రాలను ఆహార కమిషన్ రాష్ట్ర సభ్యులు బి.కాంతారావు బుధవారం ఆకస్మిక తనికీలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని రేషన్ డిపో, అంగన్వాడీ కేంద్రాల్లో స్టాక్ వివరాలను తెలిపే బోర్డులు లేకపోవడంపై మండిపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల్లో గుడ్లు తూనికలు తక్కువగా ఉండడంతో పాటు, చిన్నారులకు వండిన ఆహార నాణ్యతలను పరిశీలించారు. స్థానిక పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించి జగనన్న గోరుముద్ద ఆహార నాణ్యతను, పరిసరాల పరిశుభ్రతకు సంబందించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. వావిలపల్లి వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్ వసతిగృహాన్ని, లోలుగులోని కెజిబివిని సందర్శించారు. ఈయన వెంట సివిల్ సప్లయి, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, మధ్యాహ్న భోజనం అధికారులు పాల్గొన్నారు.

జి.సిగడాం: జి.సిగడాం ఎపి మోడల్ స్కూల్, కెజిబివి, బిసి వెల్ఫేర్ హాస్టల్, సంతవురిటి బిసి వెల్ఫేర్ హాస్టల్‌ను ఎపి ఫుడ్ కమిషన్ నంబరు కాంతారావు సందర్శించారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయలు, మెనూ, ఆహ్లాదకరమైన వాతావరణ, విద్యపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడి గుడ్లు, బియ్యం నిల్వ, రికార్డుల నిర్వహణపై తనిఖీ చేశారు. కార్యక్రమంలో బిసి వసతి గృహ అధికారి లోలుగు నూకరాజు, జిల్లా సివిల్ సప్లయి డిఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు స్మరించుకుందాం

ఎస్‌పి జి.ఆర్.రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

భారతదేశ స్వాతంత్రం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మేరా మట్.. మేరా దేశ్ కార్యక్రమంలో శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలస జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో బుధవారం మొక్కలు నాటరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇక్కడి మట్టిని సేకరించి దేశ కేంద్రానికి పంపిస్తున్నామని తెలిపారు. ప్రతిజ్ఞ, అమరవీరులకు గౌరవ వందనం, 75 మొక్కలు నాటే వసుధా వందనం, భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశంతో కూడిన శిలాఫలకాల ఆవిష్కరణ, అమరవీరుల త్యాగాలు గుర్తించడం వంటి ఐదు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెబ్ జాయింట్ డైరెక్టర్

కవిటి : ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిపి పద్మ

ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌పి రాధిక

ఎం.ఎన్.మణికంఠ, అదనపు ఎస్‌పిలు టి.పి. విఠలేశ్వర్, జె.తిపేస్వామి, డిఎస్‌పిల ఎస్.బాలరాజు, డి.విజయ్ కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిబుల్ ఐటి ఆధ్వర్యాన మండలంలోని బురిడికంచరాం, ఎచ్చెర్ల, కేశవరావుపేట పంచాయతీల్లో మన దేశం.. మన మట్టి కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ మునిరామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డాక్టర్ అసిరినాయుడు, అసోసియేట్ డీన్ కె.రమణ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుందరావు, పిఒలు డాక్టర్ జి.ఈశ్వరరావు, డాక్టర్ వి.సింహాచలం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఆజాదీ కా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన 75 మొక్కలను నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం పాల్గొన్నారు.

కె.కొత్తూరులో నిర్వహించిన నా భూమి నా దేశం కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి పాల్గొని మొక్కలను నాటారు. ఎపిఒ బగాది ప్రసాదరావు, సర్పంచ్‌లు మొర్రి శంకరరావు, వాన తవిటియ్య, ఎంపిటిసి ప్రతినిధి పొందర శ్రీనివాసరావు, కార్యదర్శి కె.చంద్రరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని జీయన్నపేట, జగన్నాథసాగరం గ్రామాల్లో నా భూమి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, ఉపాధి హామీ ఎపిడి ఎం.శైలజ, ఎపిఒ అరుణ్‌కుమార్, క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్, బలగ సూర్యారావు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని ఆర్.కరాపాడులో నిర్వహించిన నా భూమి, నా దేశం కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ పాల్గొని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, స్థానిక సర్పంచ్ లచ్చయ్య, కార్యదర్శి అబ్దుల్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మొక్కలను నాటుతున్న 'ఐతమ్' విద్యార్థులు

చంద్రబాబు దృష్టికి రైతుల సమస్యలు

రామకృష్ణ

బూర్జ : అన్నదాతల సమస్యలను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అనేపు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయంలో రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. చంద్రబాబు నాయుడు తన పర్యటనలో భాగంగా గురువారం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి మండలంలోని పాలవలస గ్రామానికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి యువకులు, రైతులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం సరిహద్దు నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి 16 బస్తాలను పట్టుకున్నారు. బెల్లుపడా కూడలి వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 750 కేజీల బియ్యం, బస్తాలు, ఆటోలను సీజ్ చేశారు. దీని విలువ రూ.28,500 ఉంటుందని విజిలెన్స్ ఎస్ఐ ఐ.రామారావు తెలిపారు. ఒడిశా రాష్ట్రం సుమండి గ్రామానికి చెందిన రంగాల హరిచంద్ర బియ్యం వ్యాపారి ఎటువంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. బియ్యం వ్యాపారి అన్నారు. ఆయనపై కేసు నమోదు చేశామని అన్నారు. దాడుల్లో రామ్మోహన్, సివిల్ సప్లయి డిటి సతీష్, ఉమా పాల్గొన్నారు.

17న కలెక్టరేట్ వద్ద హమాలీల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హమాలీ కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, హమాలీ కార్మికుల సంఘం రాష్ట్ర ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య తెలిపారు. నగరంలోని కూరగాయలు మార్కెట్ యార్డులో ధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీ, జట్టు, ముఠా, కళాసీ కార్మికులకు పనిభద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర చట్టం అమలు కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ నిధి సౌకర్యం కల్పించాలన్నారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువుటెత్తు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అమ్మన్నాయుడు

నిదర్శనంగా ముఠా కార్మికుల జీవితాలు కొనసాగుతున్నాయని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. హమాలీ, ముఠా, కళాసీ కార్మికులు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణ, ఎల్.రమణ, ఆర్.రమణ, ఎన్.దుర్గారావు, కృష్ణ, కె.రాము పాల్గొన్నారు.

ప్రశాంతంగా అంగన్వాడీ ఇంటర్వ్యూలు

టెక్కలి : సమగ్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యాన టెక్కలి, కోటబొమ్మాళి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల, ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ప్రశాంతంగా సాగాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తన ఛాంబర్‌లో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. టెక్కలి ప్రాజెక్టు పరిధిలో ఒకటి, కోటబొమ్మాళి ప్రాజెక్టు పరిధిలోని 8 అంగన్వాడీల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టారు. కార్యక్రమంలో పిఒలు పి.శోభారాణి, హైమావతి, మణి, కె.కొత్తూరు వైద్యాధికారి గాయత్రి పాల్గొన్నారు.

12,13న 'ఐలు' రాష్ట్ర మహాసభలు

ఆమదాలవలస : ఆగస్టు 12, 13 తేదీల్లో గుంటూరులోని శుభం కన్వెన్షన్ సెంటర్లో ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పారావు, ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది పి.వి.సురేంద్రనాథ్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, తెలంగాణ ఐలు రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కుమార్, బగాది గోవిందరాజు, ఎస్.ప్రసాదరావు, జి.ప్రభాకరరావు, ఎ.రమణారావు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల రక్తదానం

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం వల్ల మరొకరికి ప్రాణమిచ్చే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు రక్తదానం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యాన రెడ్‌క్రాస్ సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శివిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వంద యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ వెంకటతిలక్, చీఫ్ మేనేజర్ దుర్గాప్రసద్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, పూర్వ జెసి పి.రజినీకాంతరావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ దేశాలు ఆధిపత్య ధోరణలను పక్కనపెట్టి శాంతి స్థాపన దిశగా అడుగులు వేయాలని న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పోలుమహంతి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. అన్వాయుధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ గ్లోబల్ నెట్‌వర్క్, ఇస్కఫ్, సోషల్ మీడియా క్లబ్‌ల సంయుక్తంగా న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణ్వాయుధాల వల్ల హిరోసిమా, నాగసాకి విధ్వంసం ప్రపంచానికి గుణపాఠంగా నిలచిందన్నారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ జపాన్‌లోని నాగసాకి నగరంపై ఫ్యాట్ మ్యాన్ ఆటంబాంబు విధ్వంసం సృష్టించిందని, ఆనాటి విధ్వంసం నుంచి నేటికీ కోలుకోలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

ఎన్ఎసి అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ ఎన్ఎసి అభివృద్ధికి చర్యలు చేపట్టామని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. కాశీనగర్ ఎన్ఎసిలో బుధవారం నిర్వహించిన ముక్తా యోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్ఎసి అభివృద్ధి ముక్తా యోజన ద్వారా రూ.1.60 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. 45 పనులకు ఐదు డెవలప్‌మెంట్ ఆథారిటీకి, 31 పనులు ఎస్‌ఎచ్‌జికి పయోగిస్తామని అన్నారు. అనంతరం 45 పనులని, వాటిలో 5 పనులు స్లం డెవలప్మెంట్ అథారిటీకి సంబంధించినవని, 31 పనులు ఎస్. ఎచ్. జి. కి చెందినవని తెలిపారు. మహిళలు అన్నింటిలో ముందుండాలని అన్నారు. అప్పుడే ఒడిశా రాష్ట్రం మొదటిస్థానంలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, ఉపాధ్యక్షులు రఘురామ్ సాహు, కార్యనిర్వహణ అధికారి ఆశిష్ కుమార్ ప్రధాన్, కో-ఆర్డినేటర్ రాకేష్ దాస్ పాల్గొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవనాలు, ఫ్రంట్ ఎలివేషన్ సివిల్ వర్క్ పనులు చేపట్టారని అన్నారు. జిల్లాలో నాలుగు పిహెచ్‌సిలను అభివృద్ధి చేపట్టారని అన్నారు. పాతర్లపల్లి, శ్రీకూర్మం, ఉర్లాం, మెళియాపుట్టి పిహెచ్‌సిలను రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నాడు-నేడు కింద పిహెచ్‌సిలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ

ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

బొడ్డేపల్లి మీనాక్షి, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ చంద్రకుమారి, మండల ఎఒ దానకర్ణుడు, మెళియాపుట్టి, చాపర పిహెచ్‌సిల వైద్యాధికారులు హేమంత్‌లక్ష్మి, పావని, గ్రీష్మ, అలేఖ్య, రెడ్డిస్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వారణాశికి రోజూ రైలు నడపాలి

కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌలభ్యం కల్పించాలని ఎంపీకింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్‌ను ఢిల్లీలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. శైవ క్షేత్రం వారణాశికి నిత్యం వేలాదిమంది యాత్రికులు రాక పోకలు సాగిస్తున్నారని అన్నారు. వారి కోసం విశాఖ నుంచి వారణాశికి వారం వారం నడుపుతున్న రైలును రోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఒడిశా రాజధాని భువనేశ్వర్‌తో విశాఖపట్నాన్ని అనుసంధానం చేసే విధంగా ప్రతిష్టాత్మక సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపాలన్నారు. దీనివల్ల రెండు ప్రాంతాల మధ్య విద్య, వైద్యం, వాణిజ్యం, ఇతర అవసరాల రీత్యా ప్రయాణించే వేలాది మందికి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో వందేమాతరం రైలు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమదాలవలస-ఇచ్ఛాపురం మధ్య రాకపోకలు సాగిస్తున్నారని, వారి కోసం ప్రస్తుతం విశాఖ-పలాస మధ్య నడుస్తున్న మెమూ రైలు ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. అలాగే భువనేశ్వర్-పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న మెమూ శ్రీకాకుళం రోడ్డు వరకు నడపాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ఉగ్రసేనును సన్మానిస్తున్న సువర్ణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని గ్రంథాలయాలకు నిధులు సమీకరించి అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగులతో బుధవారం సమీక్షించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన బలగ, టెక్కలి శాఖా గ్రంథాలయాధికారులు ఉగ్రసేను, రూపావతికి ఉత్తమ అవార్డులు అందజేసి సన్మానించారు. ఎంతో మంది యువతకు పుస్తకాలు చదవడంపై ఆసక్తిని పెంచి ప్రోత్సహించిన ఉగ్రసేను, రూపావతి ఉద్యోగులకు మార్గదర్శిగా నిలిచారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ ఉద్యోగిగా భావించకుండా బాధ్యతగా పనిచేయాలన్నారు. అప్పుడే గ్రంథాలయాల సార్థకత ప్రజలకు అందుతుందన్నారు. సమవేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, సువ్వారి సత్యనారాయణ, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

నిర్వాసితులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి- కొత్తూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు వంశధార ప్రాజెక్టు సందర్శించే ముందు నిర్వాసితులకు క్షమాపణ చెప్పి రావాలని నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు డిమాండ్ చేశారు. తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండా 2017లో నిర్వాసితులను సంక్రాంతి పండగ చేసుకోనివ్వకుండా బలవంతంగా తరలించారని అన్నారు. న్యాయంచేయాలని నిర్వాసితులు పోరాడితే ఐదు వేల మందిపై కేసులు పెట్టి... ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నించారు. సొంత జిల్లా చిత్తూరు గలేరు నగరి ప్రాజెక్టు పూర్తి చేయకుండా ఈ అర్హతతో ప్రాజెక్టులను సందర్శిస్తున్నారని ప్రశ్నించారు. సిఎం జగన్ నిర్వాసితులకు రూ.216 కోట్లు అదనపు పరిహారం చెల్లించారని గుర్తు చేశారు. ఈయనతో పాటు హిరమండలం ఎంపిపి ప్రతినిధి తిరుపతిరావు, సర్పంచ్ సుంకర కోటేశ్వరరావు, కొయిలాపు శ్రీనివాసరావు, ఎంపిటిసిలు తట్ల శంకరరావు, చింతాడ శ్రావణి, వై.తవితయ్య, జి.మోహనరావు, కొయిలాపు సంజీవరావు, ధర్మారావు, టి.పోలినాయుడు, పడాల వెంకటకృష్ణ ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రయివేటు ఆస్పత్రి సిబ్బందితో గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు పున:ప్రారంభించనున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పొగిరి ప్రకాశరావు తెలిపారు. పొందూరు పట్టణంలోని అభయ ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగంలోని రోగులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో 3,257 రకాల కేసులకు, 1590 రకాల కేసులకు మాత్రమే ఆసరాను అందిస్తున్నామని అన్నారు. జీవనోపాధికి ఆటంకం కలిగే కేసులకు మాత్రమే ఆసరా అందుతుందన్నారు. గర్భిణులు ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆరు, ఎనిమిది నెలలు, డెలివరీ ముందు తీసే స్కానింగ్‌లకు ఉచితమని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు అందుబాటులో లేకపోయినా టెలిఫోనిక్ ఇంటిమేషన్ సౌకర్యం ఉందని, దీని ద్వారా 72 గంటలులోగా ఆస్పతిలో ఆరోగ్యశ్రీ కార్డును సమర్పించవచ్చునని పేర్కొన్నారు. అలాగే టైఫాయిడ్, డెంగీ వంటి పలు జ్వరాలకూ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. ఈయనతో పాటు వైద్యులు నరేష్‌కుమార్ ఉన్నారు.

రోగితో మాట్లాడుతున్న ప్రకాశరావు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మామిడిగుడ్డిలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పాల్గొని కేక్‌ను కట్ చేసి గిరిజనులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులంతా ఐక్యంగా ఉండాలన్నారు. గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని పేర్కొన్నారు. గిరిజన ఆచార, సంప్రదాయాలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, పెన్నులు, ప్లాంక్స్ పంచి పెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చందర్రావు, సవర రంగారావు, జనపరెడ్డి కన్నబాబు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : విద్యా సామగ్రిని అందజేస్తున్న శ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్ : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని బాపూజీ కళామందిర్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డిపిఒ రవికుమార్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు కొంక్యాన వేణుగోపాల్, పర్యాటక జిల్లా శాఖాధికారి నారాయణరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలం జక్కరపేటలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి బొంతు అప్పారావు పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల హక్కులను గుర్తించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తుందని అన్నారు. అడవులపై వారు సాధించుకున్న హక్కులను తొలగించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఆదివాసీలు తిండి కోసం వలసలు పోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. వీరు విద్య, వైద్య సదుపాయాలు, ఉపాధి లేక దుర్భర జీవితం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్యాడ రమేష్, బొంతు ధర్మారావు, డి.హరీష్, బోంతు నర్సమ్మ పాల్గొన్నారు.

గోవా ఆదివాసీ వేడుకల్లో...

పలాస : ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఆధ్వర్యాన గోవాలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆంధ్రా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు, ఎక్స్‌క్యూటివ్ మెంబెర్స్ సవర భాస్కరరావు, జన్ని ధర్మారావులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పెద్దపేట అర్ఫ్ స్వచ్ఛంద సంస్థలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఎపి సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు, డైరెక్టర్ నూక సన్యాసిరావు, శ్రీకాకుళం డివిజన్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ, శ్రీకాకుళం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్యామ్‌సుందరరావు, ఆమదాలవలస సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.విక్రమ్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

పర్లాకిమిడి : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గజపతి జిల్లా పర్లాకిమిడి సిపిఎం కార్యాలయం నుంచి జిల్లా సమూహ ఆస్పత్రి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముచ్చి బంగారయ్య, మహిత మిషాల్, పర్లాకిమిడి పట్టణ కమిటీ సభ్యులు డి.వెంకటరావు, జెమ్స్, ఆదివాసీ మంచ్ పర్లాకిమిడి పట్టణ కమిటీ సభ్యులు మజ్జిస్ సబర్, లజ్జర్ సబర్, శ్రీను బెహరా పాల్గొన్నారు. అలాగే గజపతి జిల్లా గుమ్మా సమితి తారంగడ పంచాయతీ పారసంబ, రాయగడ జిల్లా గుణుపూర్ సమితి రగడ పంచాయతీ సుబుద్ధిగూడల్లో ప్రపంచ ఆదివాసీ దినం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి, గజపతి జిల్లా కార్యదర్శి కేదార్ సబర్, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం పాల్గొని మాట్లాడారు. మణిపూర్, హర్యానా, ఒడిశాలోని కాశీపూర్‌ల్లో ఆదివాసులపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను ఖండించారు.

'నా భూమి-నా దేశం'ను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వెంకంపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని అన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నా భూమి... నా దేశం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, సర్పంచ్‌లు మెట్ట అమ్మజమ్మ, సూరపు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మధు

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కె.మధు అన్నారు. మండలంలోని అలమాజీపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకులు ఎప్పుడూ ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోవని తెలిపారు. ఎటిఎంల్లో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కోరరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం పి.కమల, సిసి కె.రోజాలత, మహిళా పోలీస్ జి.బాలామణి, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

మందులను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

120 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని బెల్లుపడా కాలనీలో వార్డు కౌన్సిలర్ ప్రదీప్‌కుమార్ తండ్రి గువ్వాడ జన్మదినం సందర్భంగా రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వైద్యులు 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ గువ్వాడ దిలీప్, పెద్దలు అయ్యప్ప, సంతోష్, గవరయ్య, పాలేపు దివాకర్, నరసింహులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం లెక్కింపు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ హుండీని ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. 75 రోజులకు లెక్కించగా రూ.4,36.833లు ఆదాయం వచ్చిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్.రవికుమార్ పర్యవేక్షణలో ఈ హుండీలను లెక్కించామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, బోయిన కృష్ణారావు, కమిటీ సభ్యులు, దుంపల వెంకటేశం, అర్చకులు కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, కమ్మకట్టు మాధవరెడ్డి పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

ఈనెల 10న నిర్వహించనున్న నేషనల్ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని డిఐఒ ఆర్.వి.ఎస్.కుమార్ సూచించారు. మండలంలోని కింతలి, తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆల్బాండజోల్ మాత్రలను వినియోగం ద్వారా విద్యార్థులలో రక్తహీనతను నివారించవచ్చునని అన్నారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు ఆల్బాండజోల్ మాత్రలు పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. తాడివలస పిహెచ్‌సి పరిధిలో 8,100 మంది, కింతలి పిహెచ్‌సి పరిధిలో 4,105 మందికి ఈ మాత్రలను వేయనున్నట్లు పేర్కొన్నారు. 0-2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర, 3 నుంచి 19 సంవత్సరాల వారికి ఒక మాత్ర వేయాలని తెలిపారు. ఈయనతో పాటు వైద్యాధికారులు మల్లీశ్వరమ్మ, రమేష్‌నాయుడు, .సాగరిక, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు హరిప్రసన్న ఉన్నారు.

పోలాకి : ఈ నెల 10న నిర్వహించనున్న డీ వర్మింగ్ డేను విజయవంతం చేయాలని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రీధర్ పిలుపిచ్చారు. ఈ ఆరోగ్య కేంద్ర పరిధిలో 69 గ్రామాలు, 7 ఉపకేంద్రాల 14 సచివాలయం పరిధిలో 48 ప్రభుత్వ, మూడు ప్రయివేటు స్కూళ్లు, మూడు జూనియర్ కళాశాల, 69 అంగన్వాడీల్లో డీ వార్మింగ్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్రగ్ అడ్మినిస్ట్రేటర్ శిక్షకులు డాక్టర్ నల్లి రవికుమార్, ఈశ్వరమ్మ, పిహెచ్ఎన్ శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

జలుమూరు: డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలిపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిహెచ్ఒ స్వాతి, ఎఎన్ఎం ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ప్రతి విద్యార్థీ నులిపురుగుల నివారణా మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని టెక్కలి డిఇఐసి ప్రాజెక్టు సోషల్ వర్కర్ డొక్కరి మోహనరావు అన్నారు. గోవిదంపురం జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు.

పొందూరు : వివరాలు తెలుసుకుంటున్న కుమార్

రాత్రివేళల్లో విధుల్లో ఉండాలి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డిసిహెచ్ఒ జె.భాస్కరరావు ఆదేశించారు. పొందూరు సామాజిక ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రులను ప్రోత్సాహించి పెంచాల్సిన వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రయివేటు ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కింతలి పిహెచ్‌సి పరిధిలో ప్రభుత్వాస్పత్రిలో 35 ప్రసవాలు జరగగా, ప్రయివేటు ఆస్పత్రుల్లో 177 ప్రసవాలు, తాడివలస పిహెచ్‌సి పరిధిలో ప్రభుత్వాస్పత్రిలో 24 ప్రసవాలు, ప్రయివేటు ఆస్పత్రుల్లో 108 ప్రసవాలు, జి.సిగడాం పిహెచ్‌సి పరిధిలో ప్రభుత్వాస్పత్రిలో 23 ప్రసవాలు జరగగా, ప్రయివేటు ఆస్పత్రిలో 122 ప్రసవాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రసవాలను తప్పనిసరిగా జరిగేలా దృష్టి సారించాలన్నారు. వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని, దీనిని అతిక్రమిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈయనతో పాటు సూపరింటెండెంట్ రామ్‌దాసు, వైద్యాధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న భాస్కరరావు

ఈ-క్రాప్ నమోదు వేగవంతం

పోలాకి: మాట్లాడుతున్న ఎఒ చిరంజీవి

పోలాకి: మండలం ఈ ఏడాది అన్ని సచివాలయం పరిధిలో పంట కోత ప్రయోగాలు విజయవంతం చేయాలని మండల ఎఒ చిరంజీవి ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో, విఆర్ఒలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కొక్క సచివాలయం పరిధిలో సాగు విస్తీర్ణం బట్టి వ్యవసాయ కమతాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఏ విస్తీర్ణంలో ఏ రకమైన పంటలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.శ్రీనివాసరావు, ఆర్ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఈ-క్రాప్ నమోదుపై తహశీల్దార్ కార్యాలయంలో విఎఎ, విఆర్ఒలకు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్టపరిహారం, బీమా, రైతులు పండించే పంటలకు మద్దతు ధర, సున్నా వడ్డీ, పంట రుణాలు వర్తిస్తాయని అన్నారు. తహశీల్దార్ సరోజిని మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు గ్రామస్థాయిలో పక్కాగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఎఒ దానకర్ణుడు, సహాయ గణాంకాధికారి మనోహర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- జలుమూరు

మనతోపాటు మనం నివసించే పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని శ్రీకాకుళం మెడికల్ సబ్ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సైరిగాంలో పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించి నీటి నిల్వ లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్‌తోపాటు ఇంటింటా ఫీవర్ సర్వే నిరంతరం చేయాలన్నారు. జ్వరం ఉంటే వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించాలన్నారు.

కార్యక్రమంలో సైరిగాం పిహెచ్‌సి వైద్యాధికారి పి.గురునాథరావు, విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు, సిబ్బంది రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

సోంపేట : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

సోంపేట: మండలంలోని భుశాభద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం ఆర్.వి.లత అధ్యక్షతన బుధవారం ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, కామేశ్వరరావు, కె.శిరీష, దివ్యభారతులకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.విశ్వనాథం, ఉపాధ్యాయులు సీతారాములు, గౌరి, ప్రతాపరావు, రాజారావు పాల్గొన్నారు.

కంచిలి : మండలంలోని పెద్దశ్రీరాంపురం ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులను సత్కరించారు. మాజీ సర్పంచ్ మాదిన రామారావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

టిడిపితోనే మహిళా సాధికారత

వజ్రపుకొత్తూరు : టిడిపితోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని పలాస నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పుచ్చ శోభారాణి అన్నారు. మండలంలోని రెయ్యపాడు పంచాయతీలో టిడిపి మహాశక్తి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్ గ్యారంటీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నెయ్యిల శాంతమ్మ, కుత్తుమ జయ, ఇప్పిలి మాధురి, నక్క చంద్రకళ, సురాడ మోహనరావు, పుచ్చ ఈశ్వరరావు, కె.రమణ, ఉమామహేశ్వరరావు, పాపారావు, మాజీ సర్పంచ్ బాలాజీ, మల్లేష్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆర్థికసాయం

పలాస : పలాస కొత్తవీధికి చెందిన సకలాభక్తుల గిరిబాబుకు సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ పైడిశెట్టి దినేష్ కుమార్ రూ.పది వేలు, నిత్యావసర వస్తువులు బుధవారం అందజేశారు. భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చినా తనను సంప్రదిస్తే ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ భార్గవి

తేలుకుంచిలో 'పొలంబడి'

ఇచ్ఛాపురం : వ్యవసాయ అధికారులు సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని మండల ఎఒ భార్గవి రైతులకు సూచించారు. మండలంలోని తేలుకుంచిలో రైతు పొలంలో బుధవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి నాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దిగుబడి ఎక్కువ వస్తుందని అన్నారు. మొనలు త్రుంచి వరినాట్లు వేయడం, కాలి బాటలు తీయడం, చదరపు మీటరు కు 3-5 మొక్కలు నాటడం ద్వారా దిగుబడి ఎక్కువ వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మెరుగు సూర్యనారాయణరెడ్డి, దివాకర్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

కోటబొమ్మాళి: మండలంలోని దంత ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువైన క్రీడా సామగ్రిని పూర్వ విద్యార్థి వెలమల బాబ్జి ప్రధానోపాధ్యాయుడు గొండు నారాయణరావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు చాలా అవసరమని అన్నారు. దానికి సహకరించిన బాబ్జికి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద వెలమల కృష్ణారావు, పాఠశాల చైర్మన్ లావేటి సింహాచలం, ఉపాధ్యాయులు నారాయణరావు, రామారావు, జ్యోతి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రిని అందజేస్తున్న బాబ్జి

'లైన్ షోయింగ్' వరినాట్లు పూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా లైన్ షోయింగ్ వరి నాట్లు బుధవారంతో పూర్తయ్యాయని యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందజేస్తున్న చేపేనపేట మహిళా కూలీలకు సిబ్బంది చిరంజీవి, సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 150 ఎకరాల వరకు లైన్స్ షోయింగ్ విధానంలో నాట్లు వేయించామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో పని చేయడం వల్ల ఎక్కువ విస్తీర్ణంలో లైన్స్ షోయింగ్ విధానం చేయగలిగామని అన్నారు.

మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

చంద్రబాబు జిల్లాకు చేసింది శూన్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ సిఎం చంద్రబాబునాయుడు తన 14 ఏళ్ల పాలనలో జిల్లాకు చేసింది శూన్యమని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఎద్దేవా చేశారు. పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మూడు ఇరిగేషన్ ప్రాజెక్టులు మడ్డువలస, వంశధార, ఆఫ్‌షోర్‌ల అభివృద్ధి చంద్రబాబు చేసింది శూన్యమని అన్నారు. ఆమదాలవలస కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీని నిర్దాక్షిణ్యంగా మూయించేశారని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ముద్దాడ ఈశ్వరరావు, కొప్పల ఈశ్వరరావు, పైడి రామారావు, గురుగుబెల్లి భాస్కరరావు, చింతాడ రాఘవేంద్ర పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రమణ

అంగన్వాడీ భవనం నిర్మించాలని వినతి

పొందూరు: మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో కొత్తగా అంగన్వాడీ భవనాన్ని నిర్మించాలని జనసేన మండల అధ్యక్షుడు కొంచాడ రమణ కోరారు. ఈ మేరకు సిడిపిఒ బాలామణిని బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన మండలంలోని జనసైనికులు అంగన్వాడీ భవనం పరిశీలించి పూర్తిగా శిథిలమైందని అన్నారు. దీంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని అన్నారు. ఎప్పుడు కూలుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కరుణాసాగర్, పల్ల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గర్భిణులకు వైద్య పరీక్షలు

పలాస : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకునేలా వారికి అవగాహన కల్పించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవాని శంకర్, సూపరింటెండెంట్ మేఘన అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు గర్భిణులకు ప్రభుత్వాస్పరతిలో అందిస్తున్న వైద్య సేవలపై అవగాహన కల్పించాలన్నారు. కాన్పు కోసం 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

నందిగాం : మండలంలోని లఖిదాసుపురానికి చెందిన ఈగల పాపయ్య ఇటీవల మృతి చెందారు. ఈయనకు వైఎస్ఆర్ బీమా వర్తించడంతో తక్షణ సాయం కింద రూ.పది వేలు సర్పంచ బొంగి మోహనరావు మృతుని భార్య కృష్ణవేణికి బుధవారం అందజేశారు. సందర్భంగా పాపయ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పేదవారికి అండగా ఉండే వైఎస్ఆర్ బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్‌పిటిసి మాజీ సభ్యులు మాదిన గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ ఈగల సిమ్మయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఈగల తిరుపతిరావు, కార్యదర్శి బాలక స్వరూప్ పాల్గొన్నారు.